# స్పర్శ

-వేణు సంకోజు

ప్రజలు ఆమె వైపు తదేకంగా చూస్తూ పోతుంటారు. ఆమె వర్చస్సు అటువంటిది. ఆమె కట్టు బొట్టూ తీరూ అటువంటివి. ఆమె ఠీవి అటువంటిది. శాపవశాత్తు ఆమె ఆ కొట్టుకు పరిమితమైనట్టుంటుంది. ఆమె గాజులు అమ్ముతుండటమనేది నిజం కాదు – కల అన్నట్టుంటుంది. గౌరవర్ణం. తీరైన అందం. విశాలమైన కళ్ళు. అంతే అందమైన విగ్రహం. ముచ్చటైన పలువరుస. ఆ ప్రాంతానికంతా ఆమె అప్రకటిత రాణిలా వుంటుంది. అయితే యిప్పుడామె ఒక మౌన సామ్రాజ్ఞి. ఆశలు రాలిన వృక్షం. దిగులునే నెమరువేసుకునే ఏకాకి. తన పేరు మీద తానే రోసిన ఒక ఖిన్నురాలు. ఒకనాటి శ్రీనిధి. ఇవాళ కష్టాల కడలిలో మునిగిన గంగ – గంగాభవాని.

ooo

సీతారామయ్య అడ్వకేటు. బార్‌లో నలుగురితో నవ్వుతూ, చలాకీగా మాట్లాడుతూ, ఉదయం నుండి సాయంత్రం దాకా ఎంతో బిజీగా ఉన్నాననిపించుకుని ఇల్లు చేరుతుంటాడు. అలసి పోయినట్టుగా బోలెడంత ఆవసోపాలు పడుతుంటాడు. 'హమ్మయ్య' అంటూ నిట్టూరుస్తుంటాడు. చక్కెరలేని టీ తాగి నడుం వాలుస్తుంటాడు.

పేరుకు లాయరేగాని దమ్మిడీ ఆదాయం లేని సీతారామయ్య ఖర్చులకేమీ కొదవలేదు. అవసరానికి మించిన ఆదాయం – ఆదాయమంటే వారసత్వ సంపద వుంది. ఊరికే వుండడమెందుకని ఎల్ఎల్‌బి తరువాత ఎంఎల్ కూడా చేశాడు. ఊరికే వుండటమెందుకని హిందీ విద్వాన్ రాశాడు. ఊరికే వుండటమెందుకని సంగీతం గురించి వ్యాసాలు! బోలెడు పుస్తకాలు చదివాడు. వేల కేసెట్లు, వందల సీడీలు కొన్నాడు. సంగీత సాధన చెయ్యడుగాని వినడం గంటల తరబడి చేస్తాడు. గాయకుడనని కూడా అనుకుంటాడు గనుక పాడుతాడు. పాట చెబితే సినిమా పేరు, సంగీత దర్శకుడి పేరు, గాయకుల పేర్లు కంఠోపాఠంగా అప్పజెప్పుతాడు. డొక్కశుద్ధితో పాటు ధారణశక్తి కూడా వుంది గనక ఆయా సందర్భానుసారం తనకు నచ్చిన కవితోక్తులను ఉటంకిస్తూ వుంటాడు.

శ్రీనిధికి యిద్దరు కొడుకులు. అందులో ఒకడు డాక్టరు. యింకొకడు ఇంజినీరంటే ఎవరూ నమ్మరు. ఎందుకంటే, తన యిద్దరు కొడుకులకు మధ్య ఆమె ఒక అక్కో చెల్లెలో అనిపిస్తుంది గాని అమ్మ అనిపించదు. ఆమెకు అభ్యంతరం లేదుగాని ఆమె ఏదైనా యాడ్ కార్యక్రమంలో పాల్గొంటే మాత్రం సీతారామయ్యకు సుతరామూ యిష్టం వుండదు. ఆమె అందం కాదు, ఆమె పరిమళం, ఆమె దగ్గరి తనం కూడా అంగుళం దూరమైనా అతడు భరించలేడు. 'ఇటువంటి భర్తలు కూడా వుంటారా' అనిపించేంతటి అంధ ప్రేమానురక్తి అతనిది.

శ్రీనిధికి తను అందగత్తెననే స్పృహతో బాటు భర్త కన్న తెలివిగలదాని నన్న అభిప్రాయం పెద్దది. అయినా సరే, ఆమె మీద అనురాగం హెచ్చుతుందే గాని సీతారామయ్యకు తగ్గదు. ఆ మాత్రం అహం, అంతటి అందగత్తెకు గాక మరెవరికుంటుంది? ఆమెకు వుండి తీరవలసిందేనని కూడా అనుకుంటాడతడు. మునుపటికన్న మిన్నగా ఆరాధిస్తుంటాడు. పిసరంత కూడా లెక్కలేదామెకు సీతారామయ్య అంటే. ఆ తృణీకారభావాన్ని భరించడమే కాదు, అభిమానిస్తుంటాడు కూడా అతడు.

ఇద్దరు సంతానం కలిగాక, భార్యకు బాధ కలుగుతోందని చెప్పి అతడే కు.ని. ఆపరేషన్ చేయించుకున్నాడు. ఆమె కళ్ళు కాస్త భారంగా కనిపించినా భరించలేడే! ఆమె పెదాలు వణుకుతాయేమో ఎప్పుడైనా అనిపిస్తేనే విలవిల లాడిపోతాడే – ఆమెకు చెమట

పడుతుందేమోననిపించినంత మాత్రానసే సహాయ పడేందుకు జేబురుమాలు రెడీగా వుంచుకుంటాడే - అటువంటామెను ఏకంగా ఆపరేషన్ చేయించి వేధించడమే! అసంభవం అనుకున్నాడు. ఒక కొడుకు చాలని తానన్నప్పుడు శ్రీనిధే సిద్ధం కాలేదు. బలవంతంగానైతేనేమి, ఆమె కోరింది గనుక రెండవ సంతానానికి పూనుకున్నాడు. అంత అపురూపంగా చూసుకున్నాడు సీతారామయ్య భార్య శ్రీనిధిని. పిచ్చిగా ఆరాధించాడు.

కొంతకాలంగా శ్రీనిధిలో మార్పును గమనించి లోలోపలే కుమిలి పోసాగాడతను. ఆమె అతికష్టంగా గాని పెదవి మీదికి కాస్తంత నవ్వు తెచ్చుకోదు. తన అభిరుచుల్లో దేనినీ గుర్తించదు. ముక్తసరిగానే మాట్లాడుతుంది. అన్నం తినేటప్పుడు కూడా పరధాన్యంగా వుంటుంది. పడకమీద కూడా యాంత్రికంగా నే వుంటుంది.

ఆమె భుజాలు పట్టుకొని, ఆమె కడుపులో తలపెట్టి భోరున ఏడవాలనిపించింది సీతారామయ్యకు. తనను కనికరించి ప్రేమను వర్షించమని ప్రాధేయపడాలనిపించింది. కాని ఆమె తన పక్కన నిలబడేందుకైనా యిష్టం కాదన్నట్టు సంచరిస్తున్నదే! రత్నాల్లాంటి తన పుత్రులను కూడా పట్టించుకోవడం మానేసిందే! అలిగిన తాజ్‌మహల్‌లా వుంటున్నదే!...

అవును, తన పాలిటి తాజ్‌మహలే ఆమె. ముంతాజ్ మహల్‌ని మించిన తాజమహల్ ఆమె. కోటానుకోట్ల రోజామహల్ ఆమె. తన యింటి పాలిటి పూజామహల్ ఆమె. ఎందుకిట్లా మౌనంగా మ్లానంగా వుంటున్నది? ఎప్పటిలా తాజా పరిమళం వీచదేమి ఆమె వద్ద? ఆమె కదలికల్లో ఆనాటి నాదాలేవి? ఆమె పాదాలలో అప్పటి లయలు - విన్యాసాలేవీ?

బుర్ర వేడెక్కి పోతున్నది సీతారామయ్యకు. ఎంత ఆపుకున్నా ఆగనిదుఃఖంతో లోలోపలే దగ్ధమై పోతున్నాడు. అగరువత్తిలా కాలిపోతున్నాడు.

తన వల్ల ఏమైనా తప్పు జరిగిందా? తనలో అంతకు మునుపెన్నడూ కానరాని లోపమేమైనా బయటపడిందా? తనంటేనే ఆమెకు మొహం మొత్తిందా? ఇంత కన్నా యింకేం ఆలోచించలేక పోయాడతడు. అతని వశం కాకుండా పోతున్నదిక. స్వయంగా అడుగుదామని అనేకమార్లు నోటిదాకా వచ్చింది. కాని, సాహసించ లేక పోయాడు. సాహసించడానికేముంది? ఆమెలో అటువంటి అభిప్రాయం ఎందుకుంటుంది? అంతా తన వికారం గాని... అనుకుని మిన్నకున్నాడు. తనను తాను సంబాళించుకోజూశాడు. కాని కుదరలేదు. కుదరకపోయినా తప్పదు భరించవలసిందే. కళ్ళు అనూహ్యంగా చెమ్మగిలుతుంటే, ఎవరికీ అగుపించకుండా జాగ్రత్త పడ్డాడు.

ఏంలోటు చేశాడు తను? ఆమె కోసం ఒక అందమైన ఇల్లు కట్టించాడు. ఇల్లంతా పాలరాతితో, గోడలనిండా అద్దాలతో, డబ్బుకని ఎక్కడా రాజీ పడకుండా చూసుకున్నాడు. గదిలో ఏమూలనున్నా అనేక అద్దాలతో, అందాలతో శ్రీనిధి ఆకృతులు అనేకానేకం అగుపించేలా చూసుకున్నాడు. ఆమెకు బంగారం మీద మక్కువని షాఫ్ బజారునే ఆమె దోసిళ్ళలో గుమ్మరించినంత పని చేశాడు. ఆమె కోసం సర్వస్వం వదులుకునేందుకు సన్నద్ధమయ్యాడు. ఆమెకున్న చీరలూ,జాకెట్లు అంతంత మాత్రపు ట్రక్కుల కెత్తలేము, లారీలైతేనే సరిపోతాయన్నంతగా కొని పెట్టాడు.

కారణం ఏదైతేనేం, ఎడం అనేది ఏర్పడిందని అర్థం కావడానికి చాలాకాలమేమీ పట్టలేదు సీతారామయ్యకు. శ్రీనిధి తనను ఉద్దేశ పూర్వంగానే దూరం చేసుకుంటున్నదన్న విషయం - అత్యంత బాధాకరమైనదే అయినా ఆ సత్యం లోక విదితం కావడమన్నది అంతకన్నా దుస్సహమైనదనుకున్నాడు సీతారామయ్య. అందుకనే ఏమీ జరగనట్టుంటున్నాడు. ఇది మరీ ఘోరంగా, అసహ్యంగా అనిపించింది శ్రీనిధికి. తన అసహ్యాన్ని వ్యక్తపరుస్తూనే వుంది ఏదో రకంగా. దాన్ని భరించేందుకే సిద్ధపడ్డ సీతారామయ్య అంతటి అవమానాన్ని కూడా జీర్ణం చేసుకోవడానికి అలవాటుపడ్డాడు. 'ఒక మగవాడికి యింతటి సహనమా' అని ఉక్రోషంతో ఊగిపోయింది శ్రీనిధి.

○○○

ఆ రోజంతా కాలుగాలిన పిల్లిలా యిల్లంతా కలియదిరిగిన సీతారామయ్య కల ఆ ఒక్క రోజునే వెయ్యిసార్లు మరణించినంతటి బాధ కలిగింది. తలుపులు బిగించుకుని కూర్చున్నాడు. లేచి నుంచున్నాడు. లైట్లన్నీ ఆర్పేశాడు. గోడలను పట్టుకుని బావురుమన్నాడు. నిజంగా మరణించడానికి యింతకన్న కారణం గాని,. సందర్భంగాని వుండవనుకున్నాడు. అందుకోసం ఏర్పాట్లు చేసుకునే నిర్ణయానికొచ్చాడు.

తలుపు చప్పుడైంది.

వెళ్ళి తలుపుతీశాడు.

ఎదురుగా శ్రీనిధి.

అలసిన అందం. అహం మాత్రం తగ్గలేదు. ముఖంలో ఎటువంటి భావమూ లేదు. నదురు బెదురూ లేదు. చాల క్యాజువల్‌గా లోనికి ప్రవేశించింది. గదిలోకి వెళ్లి ఈజీచైర్లో వాలింది. ఒక అందమైన గున్న ఏనుగు లాగా, ఒక లేలేత తెల్లని గుర్రంలాగా ఆమె కుర్చీలో వాలింది. తలుపు వేసుకోలేదు. కళ్ళు మూసుకోలేదు. ఒక పిల్ల జమిందారులాగా విద్యుత్ కాంతికి మెరుస్తూ రంగులీనుతూ వుంది.

మొట్టమొదటిసారి ఆ అందాన్ని చూడలేక పోయాడు సీతారామయ్య. తొలిసారి శ్రీనిధి అతనికి అందవిహీనంగా అగుపించింది. తన చేతులా పాలరాతి తాజ్‌మహల్‌ను చిదిమేసినట్లుగా పళ్ళు కొరుక్కున్నాడు. ఆ దృశ్యానికి దూరంగా కదలిపోయాడు.

మరునాడు ఇల్లంతా మౌనం పాటించింది. ఇంటిల్లిపాది యంత్రాలై పోయారు. అంగుళం అంగుళం నేలా ఉక్కబోతతో విసిగి పోయింది.

ఏమీ జరగనట్టే ఉండిపోయింది శ్రీనిధి.

ఏమీ ఎరుగని సంతానం - శ్రీకాంత్, శ్రీధర్‌లు తల్లిదండ్రులను తిరుపతికి తీసుకెళ్ళేందుకని వచ్చారు తమ తమ కార్యక్షేత్రాల నుండి. కిటికీ సందుల్లోంచి గాలి చొరబడినట్లు ఒకింత అలజడి.

హడావిడంతా ఆనాడు కారుడ్రైవరు కనకయ్యదే అయ్యింది.

ఈ మధ్యకాలంలో ఎన్నడూ లేనంత ఆనందంగా, అందంగా మసలుకొన్నది ఆనాడు శ్రీనిధి. తిరుమల మీదంతా ప్రమోదమే చిరంజీవులకు. ప్రకృతి రమణీయతకు ముగ్ధులై వారు ఫోటోలు తీశారు. తీయించుకున్నారు. ఆడారు, పాడారు, పరుగులెత్తారు. పాడటమెందుకంటే తండ్రి చేత పాడించడం కోసం. ఎప్పుడూ అడగగానే వారి కోర్కెను తీర్చే సీతారామయ్య ఆనాడు పూర్తిగా విఫలుడయ్యాడు. తొలిసారి చిరంజీవులు తమ తండ్రి ముఖంలో విషాదాన్ని, రవంత కన్రెతడిని చూసి నిర్ఘాంతపోయారు.

'ఏం నాన్నా ఆరోగ్యం బాగా లేదా?' అని అడిగారు. ఒక విధమైన భయమూ బాధతో కూడా. అదేం లేదంటూ మెత్తగా అబద్ధం చెప్పి తప్పుకున్నాడు సీతారామయ్య. అంతటితో వాతావరణమంతా గంభీరంగా మారిపోయింది. అంతా అక్కడి నుండి బయలుదేరి యిక తాముంటున్న కాటేజికి చేరుకున్నారు.

పిల్లల పలకరింపుతోనే తెల్లవారింది సీతారాయ్యకు. వాళ్ళ కళ్ళు ఎర్రబారి వారి తీరులో ఎంతోమార్పు. అది గమనించిన సీతారామయ్య ఎలాగో ఫీలయ్యాడు. అనునయంగా, 'అదేమిటినాన్న అలా వున్నారు?' అనే వంతు తనదైంది.

'మనం యిక్కడ ఒక్క క్షణం కూడా వుండకూడదు బయలుదేరు నాన్నా' అన్నారు.

'ఏం నాన్నా - యిక్కడేమైనా బాధ కలిగిందా? ఎవరైనా మీకు యిబ్బందేదైనా కలిగించారా?' అడిగాడు సీతారామయ్య చిరంజీవుల నుద్దేశించి.

'బాధ, యిబ్బంది మీకు నాన్నా, మాకు కాదు' అన్నారు చిరంజీవులు.

నిర్ఘాంత పోయాడు సీతారామయ్య తన కొడుకుల మాటలు విని. 'అదేమిటి నాన్నా - నాకేం జరిగిందని అలా బాధపడుతున్నారు?' అనడిగాడు, తన బ్రాధను కప్పిపుచ్చుకునే విఫలయత్నం చేస్తూ.

'చాలు నాన్నా చాలు. ఇంతకాలం మీరు అనుభవించిన నరకం, భరించిన రంపపు కోత

చాలు. మేమెక్కడ బాధ పడతామోనని మిమ్మల్ని మీరు వంచించు కోవడం యిక చాలు. ఉన్న ఫళంగా బయలుదేరండి' అంటూ తండ్రి చేయి పట్టుకుని అర్థించారు.

సీతారామయ్యకు దుఃఖం ఆగలేదు. ఇద్దరు కొడుకులను పట్టుకుని పసివాడిలా ఏడ్చాడు. అంతటి దుఃఖంలోను 'మరి మీ అమ్మ..' (ఏమౌతుందన్నట్లుగా) అడిగాడు.

'ఆమె మా అమ్మకాదు' ఒక్క సారే జవాబిచ్చారు చిరంజీవులు.

శ్రీనిధి, డ్రైవరు కనకయ్య కనిపించలేదు.

చిరంజీవులు డ్రైవు చేయగా సీతారామయ్య తిరుగు ప్రయాణం చేశాడు.

"మీదింకా నడి వయస్సే. ఈ పరిస్థితిలో మీ వ్యక్తిగత జీవితానికి సంబంధించినంత వరకు మీరే నిర్ణయం తీసుకున్నా మాకెటువంటి అభ్యంతరమూ లేదు. పూర్తిగా సమ్మతమే" అన్నారు పిల్లలు.

ఏ దుస్థితైతే, ఏ విషఘడియ అయితే, ఏ లజ్జాకరమైన సందర్భమైతే రాగూడదని, వచ్చినా దాచివేయాలని తాను యింతకాలమూ తాపత్రయ పడుతూ వచ్చాడో అది రానే వచ్చింది. స్వంత కొడుకులే యివాళ తల్లిని అసహ్యించు కుంటున్నారని కుమిలిపోసాగాడు సీతారామయ్య.

మరునాడు ఎవరి కార్యక్షేత్రానికి వారు వెళ్ళిపోయారు పిల్లలిరువురూ.

ఎన్నడూ లేని ఏకాంతాన్ని, భరింపరాని ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాడు సీతారామయ్య. ఇంటిలోని ప్రతి తలుపూ, ప్రతి కిటికీ రెక్కా ప్రతి ఫ్రేమూ, ప్రతి మూలా, ప్రతి గదిలోని పెయింటింగులూ, అలంకరణలూ, అన్నీ తనను అపహాస్యం చేస్తూ, గేలి చేస్తున్నట్టున్నాయి. అన్నింటిలోనూ ఆమె ముద్ర మిక్కిలిగా పరిహసిస్తున్నట్టు, చిత్రవధ గావిస్తున్నట్టుగా వుంది.

మూడు రోజుల్లో ఆ యింటిని విడిచి వేరే అద్దె యింటికి మారాడు సీతారామయ్య. అపరాధ భావంతో ఒక దోషిలాగా, ఒక కాందిశీకుడిలాగా మారాడు. ఎవరినైనా కలుసుకోవడం, ఎవరితోనైనా మాట్లాడడం మానేశాడు. తనకు తాను కూడా అందుబాటులో లేనట్టుగా, యిరుకు యిరుకుగా భావిస్తూ వుండి పోయాడు.

రోజులు, వారాలు, నెలలు గడిచిపోయాయి.

సడెన్‌గా ఒక రోజు లాయర్ నోటీసు వచ్చింది. మూడు నాలుగు ముద్రలతో రీడైరెక్టయిన విషయాన్ని స్పష్టం చేసింది, దానిని అందుకుంటూ ఆశ్చర్య పోలేదు సీతారామయ్య. సజల నేత్రుడు మాత్రం అయ్యాడు. "ఆమెకు నేనేం అన్యాయం చేశాను?" అనుకున్నాడు లోలోపలే.

ooo

రాజేంద్ర తన చిననాటి మిత్రుడే. ఫోను చేసిందే తడవుగా వచ్చి వాలాడు. 'పిచ్చివాడా - నిన్ను - దేవుడి వంటి నిన్ను, కాదని కామాంధురాలై కన్న కొడుకులను కూడా కాదని వెళ్ళిపోయిన, కాదు, లేచిపోయిన ఆమె కోసం యింకా తాపత్రయ పడతావేమిటి? అవివేకం కాకపోతే... అన్నాడు లాయరు రాజేంద్ర.

"దయచేసి 'లేచిపోయింది' వంటి మాటలు వాడకురా" అన్నాడు సీతారామయ్య కళ్ళు వత్తుకుంటూ.

'నీ ఖర్మ. ఇంకా పలచనైపోతావా? ఆమె కాదంటే ఏం చేస్తావ్?' గద్దిస్తున్నట్టుగా ప్రశ్నించాడు రాజేంద్ర.

'ఆమె యిష్టాన్ని ఎప్పుడూ కాదనను. కాని నేనుగా ఆమెకు విడాకులివ్వను' ఆర్తి నింపిన స్వరంతో, గొణుగుతున్నట్టుగా, ఎవరికో నివేదించుకున్నట్టుగా చెప్పాడు సీతారామయ్య.

'అయితే యిప్పుడేం చేద్దామంటావ్?' విసుగు దాచుకోలేక అడిగాడు రాజేంద్ర. 'నీవే ఏదైనా ఆలోచించు' జవాబిచ్చాడు సీతారామయ్య.

'అయితే, ఒక మధ్యవర్తి ఉన్నాడు. బాగా చదివిన వాడు. పెద్ద మనిషి. ఆయనతో చెప్పించి చూద్దాం - ఆఖరి ప్రయత్నంగా' అని రాజేంద్ర అన్నాడో లేదో వెంటనే ఆ పని చేయరా ఎంత ఖర్చయినా సరే' అని ఆశగా అన్నాడు సీతారామయ్య.

ooo

కోర్టు ఆవరణ. ఏ మార్పులేకుండా - ఎడారికాని ఎడారిలాగా అడవిగాని అడవిలాగా

– మనుషులను బలిచ్చే కబేళాలాగా, వికృతంగా, వికారంగా, హడావిడిగా వుంది. ఏ కొందరి ముఖాల్లోనో (నల్లకోటు) తప్ప అందరి ముఖాల్లోనూ దైన్యత.

దూరాన చెట్టుకింద శ్రీనిధితో మాట్లాడుతూ జాడిపూడి సత్యారావు. ఆమె తల వంచుకుని నేలను చూస్తూనే కాదంటూ, తల అడ్డంగా తిప్పుతూ, సమాధానమిస్తున్నది.

"అమ్మా! ఆలోచించు. ఇటువంటి తొందరపాట్లు – అనూహ్య సంఘటనలు జరుగుతుంటాయి. వస్తుంటాయి. పోతుంటాయి. రామయ్యకేం కాదు. నీకే అన్యాయం జరుగుతుంది. వయస్సులో నీకంటే కనీసం నాలుగు పదుల పెద్దల వాడిని. ఇవి చేతులే అయినా కాళ్ళని ప్రాధేయ పడుతున్నాను. జీవితంలో చాల డక్కాముక్కీలు తిన్నాను. చాలామంది జీవితాలను దగ్గరగా పరిశీలించాను. నీ రత్నాల్లాంటి యిద్దరు కొడుకులను తలచుకో. ఆలోచించి ఆఖరుమాట చెప్పు. దయచేసి అభిప్రాయం మార్చుకో" అంటూ బ్రతిమాలాడు సత్యారావు.

ఆఖరు మాటగా, తల ఎత్తకుండానే, కాదంటూ తల అడ్డంగా ఊపింది శ్రీనిధి. దూరంగా నిలిచివున్న సీతారామయ్య, రాజేంద్రల వద్దకి వచ్చి విచార వదనంతో విషయం వివరించాడు సత్యారావు.

'అయితే నష్టపరిహారం అడిగిందా?' ప్రశ్నించాడు రాజేంద్ర.

"ఆ అడిగింది. రెండు లక్షలు" అన్నాడు సత్యారావు.

"ఓస్ అంతేనా! ఇరవై లక్షలడిగినా యిచ్చే వాళ్ళం" అని మిక్కిలి సంతృప్తిని వ్యక్తం చేశాడు రాజేంద్ర. 'పాపం' అని గొణిగాడు సీతారామయ్య.

"అవును పాపమే మరి! పోయ్యేకాలం కదా" అని విసుక్కున్నాడు రాజేంద్ర.

'కనీసం ఐదు లక్షలన్నా యిద్దాం రాజేంద్ర' అని ప్రాధేయపూర్వకంగా అడిగాడు సీతారామయ్య.

"అక్కర్లేదు. ఇస్తానంటున్నావు గనుక యింకో యాభైవేలు ఎక్కువిద్దాం. ఆ అహంకారికి అదే ఎక్కువ" అని రాజేంద్ర అనబోతుంటే–

"వద్దు రాజేంద్ర. ఆమెను అహంకారి అనకు. ఆమె అహంకారి కాదు, దురదృష్టవంతురాలు" అన్నాడు గాద్గదికంగా సీతారామయ్య. అతని తీరుకు సత్యారావుకు కళ్ళు చెమర్చాయి.

ооо

విడాకులు మంజూరై మూడు సం॥లు గడిచాయి.

అతికష్టం మీద రాజేంద్ర సత్యారావులు కుదిర్చిన సంబంధం యిష్టపడ్డాడు సీతారామయ్య. పునర్ వివాహానికి మంగతాయారు ఒకటే కండిషన్ పెట్టింది. రామేశ్వరం చూపెడితేనే వివాహం చేసుకుంటానని.

'శనీశ్వరం తప్పుతుందంటే రామేశ్వరం ఒక్కసారేమిటి – ప్రతి ఏడు చూపెట్టుకొస్తాడు మా వాడు' అన్నాడు రాజేంద్ర. అందరూ ఘొల్లుమన్నారు.

నిరాడంబరంగా జరిగింది పునర్ వివాహం.

ооо

అన్న ప్రకారం సీతారామయ్య మంగతాయారు కోరిన ప్రదేశాలన్నీ చూపెట్టాడు. తాను విడిచిపెట్టిన యింటిని తప్ప. ఆమె కూడా రెట్టించలేదు. అది అతనికి ఎంతో నచ్చింది. తాను వూహించుకున్న సుఖాలకు, సౌఖ్యాలకు అతడు వారసురాలిని చేసినందుకు కృతజ్ఞతా పూర్వకంగా తనకు సంతానమంటూ లేకపోయినా రంధి లేదనుకుంది. సీతారామయ్య కొడుకులను ఎవ్వరూ ఊహించనంత ప్రేమతో చూడసాగింది. వాళ్ళు కూడా ఆమెనే స్వంత తల్లికన్నా మిన్నగా భావించారు.

దేవీనవరాత్రులప్పుడు జనం రద్దీ ఎక్కువగా వుంటుంది గనుక రద్దీలేని సమయంలో కనకదుర్గ దేవాలయానికి వెళ్ళారు మంగతాయారూ, రామయ్య. ఒక చోట ఆగిపోయాడు సీతారామయ్య మంగతాయారు గాజులు తెచ్చుకుంటానంటే అతని చూపులు శ్రీనిధి మీదికి మళ్ళాయి. ఆశ్చర్యపోయాడు. ఒకింత గతుక్కుమన్నాడు కూడా ఆమె వాలకం చూసి. డ్రైవరు కనకయ్య మూడు

నెలలకే ఆమెను వదిలిపెట్టాడని కర్ణాకర్ణిగా విన్నాడు.

ఆ కొట్టూ ఈ కొట్టూ చూసి మంగతాయారు సహజంగానే శ్రీనిధి కొట్టుకు వెళ్ళడాన్ని దూరాన్నుంచే గమనించసాగాడు రామయ్య.

'కారులో వచ్చినట్టున్నావు చెల్లీ దృష్టిని మరల్చకు' అంటూ, కోరిన గాజులు తొడుగుతూ ఉచిత సలహా యిచ్చింది మంగతాయారుకు శ్రీనిధి ఉరఫ్ గంగాభవాని. మంగతాయారు చేతి గాజులను లాలనగా నిమురుతూ నజల నేత్రుడయ్యాడు సీతారామయ్య. ఇప్పుడతని చేతి వేళ్ళకు మళ్ళీ తోచీ తోచని శ్రీనిధి స్పర్శ! ■

# విజయవాడ పుస్తక మహోత్సవం

కడచిన పదహారేళ్ళుగా పండుగగా జరుగుతున్న విజయవాడ పుస్తక ప్రదర్శన జనవరి ఒకటి నుంచి 11వ తేదీ వరకు ఈ సారికూడ జరగనుంది. జనవరి ఒకటవ తేదీన సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు యు.ఆర్. అనంతమూర్తి పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తారు. ముగింపు ఉత్సవంలో ముఖ్య అతిథి రాష్ట్ర ఉన్నత విద్యా శాఖమంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు.

పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు : జనవరి 1- సాయంత్రం 5 గంటలకు, ప్రారంభకులు : ప్రసిద్ధ రచయిత ఆచార్య యు.ఆర్. అనంతమూర్తి, అధ్యక్షులు : కృష్ణా జిల్లా కలెక్టర్ శ్రీ కె. ప్రభాకర రెడ్డి, ప్రత్యేక అతిథి : ప్రసిద్ధ రచయిత రావూరి భరద్వాజ, అదే రోజు 7.30గంటలకు త్రిపురనేని గోపీచంద్ సాహిత్య వేదిక పేరిట ఆయన రచనల సమీక్ష - అధ్యక్షులు : త్రిపురనేని సాయిచంద్, వక్త : రావూరి భరద్వాజ, జనవరి 2 సాయంత్రం 7.30కు - కీ.శే. న్యాపతి రాఘవరావు శత జయంతి సభ, అధ్యక్షులు : ముళ్ళపూడి వెంకట రమణ, వక్తలు : జంధ్యాల శంకర్ 'మాజీ' మేయర్ విజయవాడ. ఎం. పూర్ణచంద్ర రావు (ఆంధ్ర బాలానంద సంఘం). జనవరి 4 సాయంత్రం నాలుగు గంటలకు విజయవాడ ప్రెస్ క్లబ్ నుంచి వాక్ ఫర్ ది బుక్స్ ప్రారంభకులు ఉమేష్ షరాఫ్, పోలీసు కమీషనరు, విజయవాడ-నేతృత్వం - ఐ.వెంకటరావు, పాత్రికేయుడు, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు. అదేరోజు అయిదు గంటలకు సభ. ముఖ్య అతిథి : ప్రాథమిక విద్యాశాఖ మంత్రి శ్రీమతి నేదురుమల్లి రాజ్యలక్ష్మి, సభాధ్యక్షత : పి. సంపత్ కుమార్, కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్, ఏడు గంటలకు ఆకాశవాణి, విజయవాడ కేంద్రం ఆధ్వర్యంలో కవితా వేదిక. జనవరి 5 సాయంత్రం కీ.శే. మల్లాది రామకృష్ణ శాస్త్రి శతజయంతి సభ - అధ్యక్షులు- శ్రీ వి.ఎ.కె. రంగారావు, వక్త : కడియాల రామమోహన్‌రాయ్. జనవరి ఆరు సాయంత్రం7.30కు కీ.శే. దుగ్గిరాల బలరామ కృష్ణయ్య శతజయంతి సభ. అధ్యక్షత - శ్రీ సి.హెచ్.వి.పి. మూర్తిరాజు, అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ సంఘం, వక్త నాగళ్ళ గురుప్రసాదరావు, కార్యదర్శి, సిద్ధార్థ కళాపీఠం. జనవరి ఏడు సాయంత్రం 7.30కు కీ.శే. ఎం.ఎస్.రావు, ఎమెస్కో వ్యవస్థాపకుల సంస్మరణ సభ- అధ్యక్షత- శ్రీమతి ఎం.రాజ్యశ్రీ- వక్త : రాజా రామ మోహనరావు, ప్రముఖ కవి కీ.శే. అజంతా సంస్మరణ-వక్త అద్దేపల్లి రామమోహన రావు. జనవరి 8, 7.30కు రచయితతో ముఖాముఖి- శ్రీ కె. శివారెడ్డి- పరిచయకర్త : డా.వి. చంద్రశేఖరరావు. జనవరి 9, 7.30కు ముల్క్‌రాజ్ ఆనంద్‌కు నివాళి- ముఖ్యఅతిథి - డా॥ మీనాక్షి ముఖర్జీ, అధ్యక్షత : అందవిల్లి సత్యనారా యణ, వక్తలు : సి.రాఘవాచారి, తెలకపల్లి రవి. జనవరి 10, ఆరు గంటలకు విద్యా వికాసంలో వార్తా పత్రికల పాత్ర అనే అంశంపై గోష్ఠి- ముఖ్యఅతిథి- కె. వేణు గోపాల్- జాయింట్ ఎడిటర్ - ది హిందూ, అధ్యక్షత-వి.జయత్- అసోసియేట్ ఎడిటర్ - ది హిందూ. జనవరి 11, ఆరుగంటలకు ముగింపు సభ - ముఖ్య అతిథి- ఉన్నత విద్యా మంత్రి శ్రీ పిన్నమనేని వెంకటేశ్వరరావు, సభాధ్యక్షత- కర్ణాటక మాజీ గవర్నరు శ్రీమతి వి.ఎస్. రమాదేవి, విశిష్ట అతిథి, బహుమతి ప్రదానం- శ్రీమతి పి.అనూరాధ, మేయర్, విజయవాడ. ■